

సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గవర్నర్ అధ్యక్షతన 'స్పిక్ మాకే' సలహామండలి సమావేశం

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్పిక్ మాకే (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ యమాంగెస్ట్ యూత్) 10వ అంతర్జాతీయ సదస్సు నిమిత్తం.. సలహామండలి సమావేశం శనివారం రాజ్‌భవన్‌లో నిర్వహించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సలహామండలి సభ్యులతో పాటు కళలు, సంస్కృతులు, విద్య, పరిపాలన రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు

మాది పీపుల్స్ ఫ్రెండ్లీ ప్రభుత్వం: డిప్యూటీ సీఎం భట్టి

రాజేంద్రనగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరాభివృద్ధికి పదివేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని, రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి కొత్త విద్యుత్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మాది పీపుల్స్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని గుర్తు చేశారు. శనివారం నగర శివారులోని గగన్‌పహడ్‌లోని సిటాడెల్ కన్వెన్షన్‌లో జరిగిన 30వ అంతర్జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మహవీర్ సేవ కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక పరివర్తన కోసం ఎటువంటి లాభాపేక్ష లేకుండా మహవీర్ జైన్ సంస్థ పనిచేయడం అభినందనీయమన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం కూడా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏడాదికి రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ఢిల్లీలో విపరీతమైన కాలుష్యం నేపథ్యంలో.. ఆ ఇబ్బందులు నగరంలో తలెత్తకుండ క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కాలుష్య కారకమైన పరిశ్రమలను హైదరాబాద్ నగరం నుంచి ఔటర్ రింగు రోడ్డు బయటకు తరలిస్తున్నామని తెలిపారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

కొత్త ఏడాదిలో ఉత్సాహంగా విధులు నిర్వహించాలి

● సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది రెట్టించిన ఉత్సాహంతో సమర్థవంతంగా విధులు నిర్వహించి పనిచేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కొత్త ఏడాదిలో నిర్ణయించుకున్న లక్ష్యాలను సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఐటీ కారిడార్‌లో పరిమిత సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని, రోడ్ల విస్తరణతో రవాణా వ్యవస్థ కొంత మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల డీసీపీలు తమ పరిధిలో చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై సర్కార్ సానుకూలం

● మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జవహర్‌లాల్‌నెహ్రూ హౌసింగ్ సొసైటీ జర్నలిస్టుల స్థలాల కేటాయింపులపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలపై ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపులో ఎలాంటి విధానాన్ని అనుసరించాలో చర్చలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. త్వరలో ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ వీడియో జర్నలిస్టు అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అనే వ్యత్యాసం లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ జారీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్‌అలీ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాములు, తెలంగాణ వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి హరీష్, యాదగిరి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



నందగిరిహిల్స్ పార్కు విషయంపై ఇరుపక్షాలతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

నందగిరి హిల్స్ పార్కు గురించి సమావేశం

బంజారాహిల్స్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నందగిరిహిల్స్ బస్తీలోని హౌసింగ్ పార్కు విషయం గురించి హైడ్రా కమిషనర్ సమావేశం నిర్వహించారు. శనివారం గురుబ్రహ్మనగర్ బుద్ధభవన్ హాల్‌లో పార్టీ నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిడి నర్సింగరావు, బస్తీ కమిటీ సభ్యులు గోపాల్‌నాయక్, రాంచందర్, రవినాయక్, మోహన్‌నాయక్, నందగిరి సొసైటీ సభ్యులు బసవరాజ్, ఎంఎం రెడ్డి పాల్గొని అభిప్రాయాలను తెలిపారు. ఇరుపక్షాల అభిప్రాయాలు తెలుసుకుని, వారి నుంచి ధ్రువపత్రాలు తీసుకున్న అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇక్కడ ఉన్న 2 ఎకరాల స్థలంలోని 272 ఇళ్లు, ఫెన్సింగ్ పార్కు ప్రాంతాలు కాపాడేందుకు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతానని హామీ ఇచ్చారు.



కేసీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు

అందరికీ అమ్మ పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలంగాణ తల్లిపై రాసిన 'అందరికీ అమ్మ పుస్తకాన్ని' బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పలువురు బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు శనివారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తాతామధు, ఎంసీ కోటిరెడ్డితో పాటు పలువురు జడ్పీ చైర్మన్లు ఉన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదు

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న చోట గతంలో మొదలుపెట్టిన అనేక అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం అడ్డుకుంటున్నదని, దాని వల్ల ఎమ్మెల్యేలకు ఏం కాదని, సాధారణ ప్రజలే ఇబ్బందులు పడతారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ప్రజల కోసం చేపట్టిన పనులను అడ్డుకోవడం భావ్యం కాదని ఆమె అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పెద్దచెరువు వద్ద నిర్మించనున్న క్రీడా ప్రాంగణంతో పాటు చెరువు కట్టపై చేపట్టనున్న ఫెన్సింగ్(కంచె) నిర్మాణ పనులకు శనివారం మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, కార్పొరేటర్ ధనలక్ష్మీరాజ్‌కుమార్‌తో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ చెరువుల సుందరీకరణపై దృష్టి పెట్టారని, ఇప్పటి ప్రభుత్వం నాటి సుందరీకరణ పనులను సైతం అడ్డుకుంటున్నదని విమర్శించారు. అల్మాస్‌గూడలో చేపట్టిన పనులను మధ్యలోనే ఆపేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ పెద్దచెరువు వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

ఎల్బీనగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్‌లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సూచించారు. ఆర్కేపురం డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మురుకుంట్ల విజయభారతి శనివారం సబితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుభరోసాను ఈ దఫా కూడా ఎగ్గొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం లేనిపోని నిబంధనలు పెడుతుందన్నారు. ఎలాంటి నిబంధనలు, లొసుగులు లేకుండా రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

● వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని త్వరలోనే వికలాంగుల పెన్షన్లపెంపు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేయనున్నట్లు వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. శనివారం మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధులకు లిపి కనుగొని వారికి ఆరాధ్యదైవంగా మారారని అన్నారు. వికలాంగుల సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రాంచంద్రన్, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధులకు లిపిని కనుగొని చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపాడన్నారు. ఈ సందర్భంగా అంధులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారికి సన్మానాలు చేశారు. లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేపి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ బి శైలజ, ప్రభంజన్‌రావు, గంగారాం, శ్రీశైలం పాల్గొన్నారు.



బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మందకృష్ణ

బ్రెయిలీ జయంతి వేడుకలకు సీతక్క రాకపోవడం బాధాకరం : మంద కృష్ణ

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలకు సంబంధిత శాఖామంత్రి సీతక్క రాకపోవడం బాధాకరమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా మలక్‌పేటలోని బ్రెయిలీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి కావస్తున్నా ఎన్నికల సందర్భంగా వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ కోర్‌కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, అందె రాంబాబు, కె జంగయ్య, నర్సింహ పాల్గొన్నారు.



బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వీరయ్య

అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి : కోదండరాం

చాదర్‌ఘాట్: అంధులు లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని మూసారాంబాగ్ అంధుల వసతి గృహం, లూయిస్ బ్రెయిలీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బీకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంధులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దివ్యాంగుల సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, నిర్వాహకులు డాక్టర్ కిశోర్‌కుమార్, సంతోష్‌కుమార్, సిరికొండ లక్ష్మీనారాయణ, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు అభినందనీయం : సుధీర్‌రెడ్డి



తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఐక్యంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారానికి కృషిచేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హయత్‌నగర్ డివిజన్ నిత్యహోమ్స్ అసోసియేషన్ సభ్యులు రూ.12లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసుకుంటున్న తాగునీటి పైప్‌లైన్ పనులను హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి కాలనీవాసులు ముందుకు వచ్చి సొంత నిధులతో తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నిత్యహోమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, అనిల్ కుమార్, నాయకులు చెనగాని శ్రీధర్‌గౌడ్, చింతల రవికుమార్, దీపావళి శ్రవణ్‌కుమార్, మిట్టకంటి సత్తిరెడ్డి, బద్దం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రాంతిహిల్స్ కాలనీ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

వనస్థలిపురం డివిజన్‌లోని క్రాంతిహిల్స్‌కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం క్రాంతిహిల్స్‌కాలనీలో కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో లింకురోడ్లు, పార్కు ఏర్పాటు, పలు సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బద్దం రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సత్తిరెడ్డి, మాజీ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, మనోహర్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

రూ1.80కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అక్బర్‌బాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల స్థానిక కార్పొరేటర్ మిన్హాజుద్దీన్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్బర్‌బాగ్ డివిజన్‌లో రూ.1.80కోట్లతో సీసీ రోడ్లను, నూతన కమ్యూనిటీహాల్‌ను, వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం నిర్మించిన బాక్స్‌డ్రెయిన్‌ను ప్రారంభించినట్లు వివరించారు. అనంతరం అక్బర్‌బాగ్‌లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన శిక్షణ కోసం ఉచిత శిక్షణ అవకాశ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇబ్‌నాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి : కార్పొరేటర్

చంపాపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను కోరారు. చంపాపేట డివిజన్‌లోని మాధవనగర్‌కాలనీలో శనివారం కార్పొరేటర్ పర్యటించి సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని రోడ్ నెంబరు 7,9లలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.39.60లక్షలు సీసీ రోడ్డు నిర్మాణం కోసం మంజూరైనట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, కాలనీ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బెనర్జీ, మణిపాల్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు సాంబమూర్తి, ముత్యాలు, అనసూయ పాల్గొన్నారు.

నేడు మన్సూరాబాద్ కాస్మోపాలిటన్ కాలనీలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

మన్సూరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) పోటీలు ఆదివారం మన్సూరాబాద్‌లో కాస్మోపాలిటన్‌కాలనీ కమ్యూనిటీహాల్ గ్రౌండ్‌లో జరుగనున్నాయి. ఆసక్తి గల మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చును. విజేతలకు ప్రథమ బహుమతి రూ. ఆరువేలు, ద్వితీయ బహుమతి రూ. నాలుగువేలు, తృతీయ బహుమతి రూ.మూడువేలు నగదు బహుమతి ప్రదానం చేయబడుతుంది. ఈ పోటీల్లో చుక్కల ముగ్గులు మాత్రమే వేయాల్సి ఉంటుంది. పోటీల్లో పాల్గొనే వారు ముగ్గులు, రంగులు వారే తెచ్చుకోవాలి. పోటీల్లో పాల్గొనాలనే వారు 9398426927/9985411064లో సంప్రదించాల్సి ఉంటుంది.

యువతకు చట్టాలపై అవగాహన కల్పించాలి

● చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్

సంతోష్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి):అవినీతి రహిత సమాజం కోసం యువతకు చట్టాలపై అవగాహన కల్పించాలని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ అన్నారు. శనివారం జైలు కార్యాలయంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజేంద్ర పల్నాటి, కొన్నె దేవేందర్, రమేష్‌బాబు, రాకేష్ పాల్గొన్నారు.

దళిత హక్కుల సాధనకు సంఘటితం కావాలి

కొత్తపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల సాధన కోసం అందరూ సంఘటితం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి పిలుపునిచ్చారు. శనివారం న్యూనాగోల్‌కాలనీలో గల ఎస్కే డాంగే భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాతరాజు నర్సింహ, శేసరాజపల్లి శ్రీదేవి, కందుల సుధాకర్, శివ, శ్రీకాంత్, దేవస్వామి, దిలీప్ పాల్గొన్నారు.

ధనుర్మాస వ్రతకల్పం పుస్తకావిష్కరణ

ఎల్బీనగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట వాసవీకాలనీలో అష్టలక్ష్మీ ఆలయంలో ధనుర్మాస పుస్తకాన్ని ఆలయ కమిటీ చైర్మన్ సోమ సురేష్ కుమార్, మాజీ చైర్మన్ మ్యాడం సుధాకర్‌గుప్తా శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బందం దామోదర్‌గుప్తా, కోశాధికారి అయిత అంజయ్య, కార్యదర్శి దాచేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విక్టోరియా మెమోరియల్ స్టేషన్ పేరును అష్టలక్ష్మీ ఆలయం స్టేషన్‌గా మార్చండి : వీహెచ్‌పీ

ఎల్బీనగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విక్టోరియా మెమోరియల్ స్టేషన్ పేరును అష్టలక్ష్మీ ఆలయం స్టేషన్‌గా మార్చండని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి బృందం కోరింది. శనివారం వీహెచ్‌పీ ప్రతినిధి బృందం మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ మాట్లాడుతూ బ్రిటీష్ వలస పాలకులకు చిహ్నంగా ఉన్న విక్టోరియా మెమోరియల్ పేరును మార్చాలని కోరారు. మెట్రో రైల్ ఎండీని కలిసిన వారిలో వీహెచ్‌పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు హెబ్బార్ నాగేశ్వర్‌రావు, మాతృశక్తి ప్రతినిధి పద్మశ్రీ, వివేకానందనగర్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, సుధాకర్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి : కిషన్

హయత్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కిషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కృష్ణ, మహేష్, వెంకటేష్, భాగ్యమ్మ, మంకమ్మ, ఎల్లమ్మ, అండాలు, లక్ష్మి సులోచన, జంగమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకుడు ఏర్పుల నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే పద్ధతుల్లో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2వ పీఆర్‌సీలో కార్మికుల వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలన్నారు. కనీస వేతనాలు, 8గంటల పని విధానం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



ప్రియ

హయత్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్ గ్రామంలో నివాసం ఉండే ప్రియ(23) చంపాపేట్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పని చేస్తుంది. డిసెంబర్ 31న డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రియకు ఫోన్ చేశారు. దీంతో ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ప్రియ పెండ్లీ కోసం కుటుంబ సభ్యులు ఇంట్లో దాచిపెట్టిన బంగారు ఆభరణాలు, నగదు కూడా ఇంట్లో కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, తెలిసిన స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో తండ్రి దీపక్ షా శనివారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో అన్ని రాజకీయ పదవులు భర్తీ

● పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్



మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, పీసీసీ ప్రతినిధి దేప

ఎల్బీనగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): త్వరలో అన్ని రాజకీయ పదవులను భర్తీ చేస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిలు శనివారం మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్‌తో కేఎల్ఆర్, దేప భాస్కర్‌రెడ్డిలు కాసేపు మాట్లాడారు. పార్టీ పదవులు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు, పార్టీ గెలిచే అంశాలపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని మహేష్‌కుమార్‌గౌడ్ వారికి చెప్పారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : రాంరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అనురాధారాంరెడ్డి

హయత్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి, కొహెడా గ్రామాల్లోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. దాదాపు రోడ్లు, తాగునీరు, వీధి దీపాలను కల్పించామని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ హరిత ధన్‌రాజ్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు మల్లేష్, ధన్‌రాజ్, కొశిక ఐలయ్య, కొత్తకుర్మ మంగమ్మ, సునీల్, బాల్‌రాజ్, నాయకులు కొంతం వెంకట్ రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ పాలసీలను సద్వినియోగం చేసుకోవాలి

చంపాపేట : పోస్టల్ డిపార్ట్‌మెంట్ అందిస్తున్న వివిధ పాలసీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ సెంట్రల్ డిప్యూటీ సూపరింటెండెంట్ సుధాకర్ కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలో శనివారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్షా బీమాయోజన, అటల్‌పెన్షన్ యోజన, ప్రమాదబీమా పథకాలను బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డితో కలిసి సుధాకర్ ప్రజలకు వివరించి పాలసీలను అందజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

సరూర్‌నగర్ : కొత్త సంవత్సరం రోజు చికెన్ కోసం వెళ్లిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శనివారం మృతిచెందిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడలోని దాసరి నారాయణకాలనీకి చెందిన కూరెళ్ల అనిల్‌కుమార్(26) ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 1న కొత్త సంవత్సరం కావడంతో సాయంత్రం తన స్నేహితుడు పవన్‌తో కలిసి చికెన్ కోసం ఆర్‌సీఐ రోడ్డులోని బీజేపీ క్వార్టర్స్ వద్ద ఉన్న షాపుకు బయలుదేరారు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకువచ్చిన ఓ ద్విచక్ర వాహనం అనిల్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దాంతో తలకు బలమైన గాయాలు కాగా, మీర్‌పేట్ పోలీసులు పంచనామా నిర్వహించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.